నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల శుక్రవారం 29 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సమావేశంలో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అక్రమ దందాల కోసమే కాంగ్రెస్‌లోకి కోనప్ప

- బహుజన వాదాన్ని కాపాడుకోవడానికే కారెక్కిన
- కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉంది
- అక్కున చేర్చుకున్న సిర్పూర్ ప్రజలు, నాయకులకు పాదాభివందనాలు
- బీఆర్ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలి
- బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కాగజ్‌నగర్ పట్టణంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ విఠల్, మాజీ ఎమ్మెల్యేలు రామన్న, సక్కు హాజరు

కాగజ్‌నగర్, మార్చి 28 : సిర్పూర్ నియోజకవర్గంలో కొనసాగిస్తున్న అక్రమ దందాలు కాపాడుకోవడానికే మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లో చేరాడని బీఆర్ఎస్ నాయకుడు, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చలు జరుపుతున్న తరుణంలోనే తన స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరాడన్నారు. అక్రమ బియ్యం, మట్కా, ప్రభుత్వ భూముల్లో వెంచర్లు వేసి దోచుకోవడానికి అధికార పార్టీ లో చేరాడని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బహుజన వాదాన్ని కాపాడుకోవడానికే కారెక్కానని, కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన గురుకులాల్లో లక్షల మంది విద్యార్థులు మెరుగైన విద్య పొందుతున్నారని కొనియాడారు. సిర్పూర్ నియోజకవర్గ ప్రజలు అనతికాలంలోనే అక్కున చేర్చుకొని శాసనసభ ఎన్నికల్లో 44వేల ఓట్లు వేశారని, నా కార్యకర్తలందరికీ అండగా ఉంటానని, వారికి పాదాభివందనాలు చేస్తున్నానన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గిరిజన బిడ్డ ఆత్రం సక్కు గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బీఎస్పీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు సోయం చిన్నయ్య, ఆయా మండలాల ప్రజలకు, సీఐటీయూ నాయకుడు అంబాల ఓదెలుకు బీఆర్ఎస్ కండువా కప్పి ఆహ్వానించారు.

పదేళ్లలో ఎంతో అభివృద్ధి..

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఆసిఫాబాద్ జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. అభివృద్ధిలో ఎంతో వెనుకబడిన జిల్లాలో మెడికల్ కాలేజీ, మైనార్టీ, జ్యోతిబాపూలే గురుకులాలు, రోడ్లు, వంతెనలు, గూడెం వద్ద అంతర్రాష్ట్ర వంతెన నిర్మించుకున్నామన్నారు. అంతేగాకుండ వార్ధా నదిపై అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణానికి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులు గడిచినా ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాగజ్‌నగర్‌లో మూతపడ్డ పేపర్ మిల్లును తెరిపించిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీకి తెగబడ్డాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి తీసుకొచ్చిందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ బహుజన వాదం పార్టీ అని, ఐపీఎస్ అధికారి తన ఉద్యోగానికి రాజీనామా చేసి బహుజనుల కోసం పోరాడడం గొప్ప విషయమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. తనకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అండగా ఉన్నారని, తన గెలుపు ఖాయమని, ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, బెజ్జూర్ జడ్పీటీసీ పుష్పలత, నాయకులు రాజ్‌కుమార్, మోయిన్, లెండుగూరె శ్యాంరావు, మిన్‌హాజ్, బీఎస్పీ, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో దెబ్బతిన్న మక్క పంటను పరిశీలిస్తున్న భూక్య జాన్సన్‌నాయక్

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

జన్నారం, మార్చి 28 : వారం క్రితం వీచిన ఈదురుగాలులకు మక్క, వరి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం తిమ్మాపూర్‌లో దెబ్బతిన్న మక్క పంటను పరిశీలించారు. రైతులు ఎంతో కష్టపడి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో ఈదురు గాలులకు నేలకొరిగి తీవ్రంగా నష్టం జరిగిందని, ప్రభుత్వం రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, ఫజల్ ఖాన్, జాడి గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్
- తుమ్డిహట్టి వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు, కౌటాల పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రాణహిత తీరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కౌటాల, మార్చి 28 : ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశించారు. గురువారం మండలంలోని తుమ్డిహట్టి వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి నగదు, అక్రమ మద్యం తరలింపును అడ్డుకోవాలని, తనిఖీలప్పుడు తప్పకుండా వీడియో తీసుకోవాలని సూచించారు. పల్లెల్లో ఎక్కడ అక్రమ దందాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండి అక్రమ దందాలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం కౌటాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విధుల్లో అలసత్వం వద్దని సూచించారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్ఐ మధుకర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

సిర్పూర్(టీ), మార్చి 28 : మండలకేంద్రం లోగల జడ్పీ పాఠశాలలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ సురేశ్‌కుమార్ గురువారం పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. మావోయిస్టులకు సహకరించవద్దని సూచించారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటల సీఐ సాదిక్ పాషా, ఎస్ఐ దీకొండ రమేశ్ పాల్గొన్నారు.

రంజాన్ కానుకలు పంపిణీ చేసిన హీరో సుమన్

కిట్‌లు అందజేస్తున్న సినీ హీరో సుమన్

మంచిర్యాల అర్బన్, మార్చి 28 : జిల్లా కేంద్రంలో వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకల కిట్‌లను సినీ హీరో సుమన్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలను కలిసికట్టుగా, కులమతాలకు అతీతంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మడుపు రాంప్రకాశ్, అరుణ, బ్లడ్ ఆర్గనైజర్ అబ్దుల్ రహీం, సలీం అక్తర్, ముస్లిం వుమెన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు ఆయేషా జబీన్, సావిత్రి ఫర్నిచర్ నిర్వాహకులు శ్రీధర్, భాస్కర్ పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్ : 5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు

బెల్లంపల్లి : జాతీయ జెండాతో 5కే రన్ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

ఉత్సాహంగా 5కే రన్

- మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్‌లలో ప్రధాన వీధుల గుండా పరుగు
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

చెన్నూర్ : 5కే రన్‌లో పాల్గొన్న యువకులు, ఉద్యోగులు.

మంచిర్యాల అర్బన్, మార్చి 28 : జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు చేపట్టిన 5కే రన్‌ను కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ అధికారులతో కలిసి ఉత్సాహంగా పరుగు తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో స్వీప్‌లో భాగంగా వాక్ టూ పోలింగ్ బూత్, ఓటు వినియోగం, ప్రాముఖ్యత తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 2024, ఏప్రిల్ 1 వరకు 18 ఏళ్లు నిండిన వారంతా ఏప్రిల్ 15లోగా తమ వివరాలను నమోదు చేసుకొని నూతన ఓటరు కార్డు పొందాలని కోరారు. జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు ఓటు వేసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి, మార్చి 28 : లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు ఓటు హక్కుపై అవగాహన కోసం గురువారం బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించిన 5 కే రన్ ఉత్సాహంగా సాగింది. తిలక్‌స్టేడియం వద్ద ఆర్డీవో హరికృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. భారీ జాతీయ జెండాతో పాత బస్టాండ్, కాంటా చౌరస్తా, ఏఎంసీ ఏరియా మీదుగా ఏఎంసీ గ్రౌండ్ వరకు సాగింది. ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు అక్కడ ఓటు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆర్డీవో హరికృష్ణ మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు తావు లేకుండా నిర్భయంగా ఓటు వేయాలని కోరారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై సీ-విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల హెచ్ఎం, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్, మార్చి 28 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను తెలియజేస్తూ చెన్నూర్ పట్టణంలో గురువారం 5కే రన్ నిర్వహించారు. ఓటు హక్కును వినియోగించుకో-భ్యవిష్యత్తును చక్కదిద్దుకో అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన రహదారిలో 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల తహసీల్దార్ చంద్రశేఖర్, చెన్నూర్ మున్సిపాలిటీ కమిషనర్ గంగాధర్, యువకులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, రెవెన్యూ, మున్సిపాలిటీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

వందరోజులు దాటినా గ్యారెంటీల అమలేది?

- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో దుర్భిక్షం
- కరెంట్ రాక, రైతుబంధు అందక అన్నదాతకు దుఃఖం
- వచ్చే ఎన్నికల్లో ఓటుతో చుక్కలు చూపించాలి
- చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

మాట్లాడుతున్న పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, మార్చి 28: 'అధికారం చేపట్టిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ఊదరగొట్టింది..కానీ తూతూ మంత్రంగా ఒకటో రెండో అమలు చేసి చేతులు దులుపుకున్నది.' అంటూ చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నిప్పులు చెరిగారు. హామీలు నెరవేర్చని ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న రాష్ట్రం..కాంగ్రెస్ హయాంలో దుర్భిక్షంగా మారిందన్నారు. పంటలు ఎండుతున్నా పట్టించుకొనే నాథుడేలేడని విమర్శించారు. కష్టాల్లో ఉన్న రైతాంగానికి అండగా నిలువాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నాడని మండిపడ్డారు. గురువారం గోదావరిఖలో మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి పాలనను గాలికొదిలి ప్రశ్నించే గొంతుకైన బీఆర్ఎస్‌పై ఎదురుదాడి చేయడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. కేసీఆర్ పాలనలో పుష్కలంగా సాగునీరందిందని, సమయానికి రైతుబంధు పడ్డదని, పుష్కలంగా కరెంట్ అందిందన్నారు. కానీ కాంగ్రెస్ పాలనలో రైతాంగానికి దుఃఖమే మిగిలిందన్నారు. ఆ పార్టీని ఎంపీ ఎన్నికల్లో ఒడించి బుద్ధిచెప్పాలని కోరారు.

బీజేపీని గెలిపిస్తే రిజర్వేషన్ల రద్దు..

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పీడిత ప్రజానీకం కోసం తెలంగాణ వాదం, బహుజన వాదం ఒక్కటైంది..బీజేపీని ఉన్న రిజర్వేషన్లు రద్దవుతయ్. కొత్త రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చి ప్రజల స్వేచ్ఛ హక్కులను హరించివేస్తుంది. మతం పేరిట ఉన్మాదంతో ఓట్లడుగుతున్న బీజేపీ అభ్యర్థిని ఓడించాలె. ఆరు గ్యారెంటీలను అమలు చేయని కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలె. ప్రజల గొంతుకై వస్తున్న పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ బరిలో నిలిచిన కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకోవాలి.

రైతాంగంపై రేవంత్ సర్కారు నిర్లక్ష్యం

- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, ప్రజాసమస్యలను పరిష్కరిస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు ఆచరణలో విఫలమైంది. పంటలు ఎండిపోయి రైతాంగం గగ్గొలు పెడుతుంటే చోద్యం చూస్తున్నది. మరోపక్క ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వక నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాసమస్యలను పక్కనబెట్టి బీఆర్ఎస్‌ను నామరూపాలు లేకుండా చేస్తానని ప్రగల్భాలు పలుకుతున్నడు. కేసీఆర్ సర్కారు ఇచ్చిన రైతుబంధును నిలిపివేసింది. ఉచిత కరెంట్‌ను పొగొట్టింది. ఇలా అతి తక్కువ టైంల దేశంలో విఫలమైన ప్రభుత్వంగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతులకు రుణమాఫీ చేయాలె. వరికి రూ. 500 బోనస్ ఇవ్వాలె. ఎండిన పంటలు ఎకరాకు రూ. 25 వేల పరిహారం ఇవ్వాలె. స్పందించకుంటే రైతులకు అండగా ఈ నెల 30న పెద్దపల్లిలో 36 గంటల నిరసన దీక్ష చేపడుతం. రైతులు మద్దతు ప్రకటించాలె.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- డీఈవో యాదయ్య

మంచిర్యాల అర్బన్, మార్చి 28 : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సైన్స్ ప్రదర్శనలు అనేక ఆవిష్కరణలకు దోహదం చేస్తాయన్నారు. ప్రతి విద్యార్థి సైన్స్ ప్రదర్శనల్లో తప్పక పాల్గొనాలని సూచించారు. ఇన్‌స్పైర్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఆర్ఎస్‌బీవీపీలో విజేతలుగా నిలిచిన 12 మంది విద్యార్థులతో పాటు ఇన్‌స్పైర్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన 10 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ కుమార స్వామి, రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు, గైడ్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్ విజేతలతో డీఈవో యాదయ్య

జంగాంలో రూ. 1.31 లక్షలు పట్టివేత

జైనూర్, మార్చ్ 28 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జంగాం గ్రామ శివారులో గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 1.31 లక్షలు పట్టుకున్నట్లు జైనూర్ ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు. స్థానికుడైన బొప్పు రాజయ్య దగ్గర రూ. 52 వేలు, మహారాష్ట్రకు చెందిన పాండురంగ్, ధర్మ జాదవ్ దగ్గర రూ. 79 వేలను సీజ్ చేసినట్లు ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

డబ్బులు స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ

ప్రభుత్వ భూముల సర్వే

మంచిర్యాల అర్బన్, మార్చి 28 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూములను గురువారం ల్యాండ్స్ సర్వే, రెవెన్యూ విభాగం అధికారులు సర్వే చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ల్యాండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని బస్టాండు పరిసర ప్రాంతంలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని కలెక్టర్‌కు ఫిర్యాదు రాగా, ఈ సర్వేలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని హైదరాబాద్ సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, కలెక్టర్ బదావత్ సంతోష్ సూచన మేరకు మంచిర్యాల శివారులోని 422, గర్మిళ్ల శివారులోని 92, 93 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూములను జీపీఆర్ఎస్ ట్రాకర్ ద్వారా గుర్తించినట్లు తెలిపారు. పూర్తి నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ సర్వేలో హైదరాబాద్‌కు చెందిన రాష్ట్ర డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, సర్వేయర్ సంధ్య, జిల్లా సర్వే అధికారి శ్రీనివాస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, తహశీల్దార్ రమేశ్, ఆర్ఐ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న అధికారులు

ఆర్ఎంపీ వైద్యుడిపై డీడీఎంహెచ్‌వో విచారణ

- శిక్షణ పొందిన సర్టిఫికెట్ లేదని చెప్పిన లక్ష్మణ్
- ఎక్స్‌పీరియన్స్ పత్రంపైనా తేదీ లేదు
- మృతురాలు నీలక్క ఇంటికెళ్లి వివరాలు సేకరణ
- పూర్తి నివేదికను డీఎంహెచ్‌వోకు అందిస్తానన్న అధికారి

మారుతి క్లినిక్‌లో విచారణ చేపడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాంనాయక్

దహెగాం, మార్చి 28 : దహెగాం మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అనల లక్ష్మణ్ వైద్యం వికటించి గాదం నీలక్క మృతి చెందినట్లు ఇటీవల గుర్తు తెలియని వ్యక్తి కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాంనాయక్ సదరు వైద్యుడికి చెందిన మారుతి క్లినిక్‌లో విచారణ చేపట్టారు. గాదం నీలక్కకు తాను ఎలాంటి వైద్యం చేయలేదని ఆర్ఎంపీ డిప్యూటీ డీఎంహెచ్‌వోకు రాత పూర్వకంగా రాసి ఇచ్చాడు. ఆర్ఎంపీ శిక్షణ పొందిన సర్టిఫికెట్ చూపమని కోరగా, ఆర్ఎంపీ శిక్షణ పొందలేదని లక్ష్మణ్ తెలిపాడు. ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఉన్నప్పటికీ అందులో జారీ చేసిన తేదీ లేకపోవడం గమనార్హం. ఓపీ రిజిస్టర్ లేదని, వైద్యంకోసం వచ్చే రోగుల వివరాలను నమోదు చేయడంలేదని ఆర్ఎంపీ ఆయన దృష్టికి తీసుకొచ్చాడు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆపై నీలక్క ఇంటికి వెళ్లి, ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పూర్తి నివేదికను డీఎంహెచ్‌వోకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కాగా, ఈ నెల 26న అధికారులు విచారణ కోసం వెళ్లగా మారుతి క్లినిక్ మూసి ఉండడంతో వెనుదిరిగారు. ఈ విచారణలో వైద్యాధికారి స్పందన, పీహెచ్ఎన్ పావని, సీహెచ్‌వో వెంకట్ ఉన్నారు.